సరదాగా ఈత



ప్రస్తుతం ఎండలు మండుతున్నాయి. ఉదయం పది గంటలకే భానుడు భగభగమంటున్నాడు. ప్రజలు ఉక్కపోతను భరించలేకపోతున్నారు. చిన్నారులు, యువకులు బావులు, చెరువులు, నదుల్లో ఈత కొట్టేందుకు వెళుతున్నారు. సైదాపురం మండలంలోని అన్నంరాజుపల్లి, దేవరవేమూరు, తురిమెర్ల, సైదాపురం గ్రామాల సమీపంలో ఉన్న వాగులో చిన్నారులు హాయిగా జలకాలాటలు ఆడుకుంటున్నారు. - సైదాపురం

పునాదులకే పరిమితం



దొరవారిసత్రం మండలం కొత్తపల్లి సచివాలయం పరిధిలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణ పనులు పునాదులు దాటలేదు. పిల్లర్లు వేసి వదిలేశారు. దీంతో కమ్మీలు తుప్పుపడుతున్నాయి. దీన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేపట్టింది. ఇందుకోసం రూ.25 లక్షలు కేటాయించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల గురించి పట్టించుకోలేదు. ఈ క్రమంలో కొత్తపల్లిలో ఒక మూలన అద్దె భవనంలో విలేజ్ హెల్త్ క్లినిక్‌ను నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ పనులను పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు. - దొరవారిసత్రం

నిలువెత్తు నిర్లక్ష్యం



రెండురోజుల క్రితం కురిసిన గాలీవానకు కోటలోని శ్యామ్ సుందరపురం వద్ద రోడ్డు పక్కనున్న తాటి చెట్టు కూలిపోయి పక్కనే ఉన్న మరో చెట్టుపై పడింది. మొదలు రోడ్డుపై పడకుండా గాలిలో వేలాడుతోంది. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ఎప్పుడు మీద పడుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే చెట్టును తొలగించాలని కోరుతున్నారు. - కోట

గోదాములుగా ప్రభుత్వ భవనాలు

- సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాల నిర్మాణంలో సర్కారు నిర్లక్ష్యం
- గ్రామీణ ప్రాంతాల్లో నిరుపయోగంగా మారిన ప్రభుత్వ భవనాలు
- సిమెంట్ బస్తాలు, ఐరన్‌ను నిల్వ ఉంచుతున్న కాంట్రాక్టర్లు





కొత్తపల్లి గ్రామ సచివాలయం భవనంలో నిల్వ చేసిన సిమెంట్, ఆర్బీకే భవనంలో వేరుశనగ బస్తాలను భద్రపరిచిన రైతులు

దొరవారిసత్రం: ప్రజల ముంగిటకే ప్రభుత్వ సేవలు తీసుకురావాలనే తలంపుతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం హయాంలో మాజీ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. గ్రామీణ ప్రజలకు అన్ని రకాల ప్రభుత్వ సేవలు ఒకే చోట అందుబాటులో ఉండేలా ప్రతి పంచాయతీలో గ్రామ సచివాలయంతో పాటు ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను నిర్మించారు. చాలావరకు పూర్తి చేసి సచివాలయ సేవలు అందించారు. ఎన్నికల రావడంతో కొన్ని చోట్ల సచివాలయ, ఆర్బీకే, హెల్త్ క్లినిక్ సెంటర్ల భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఆగిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తి చేసి ప్రభుత్వ సేవలు అందుబాటులోకి తీసుకురాకుండా నిర్లక్ష్యంగా వదిలేసింది. దీంతో గ్రామీణ ప్రాంతాల్లో అసంపూర్తిగా ఉన్న భవనాలను రైతులు, కాంట్రాక్టర్లు గోదాములుగా వినియోగించుకున్నారు. ఈ విషయం తెలిసినా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.

ధాన్యం నిల్వ కూడా వీటిల్లోనే..

మండలంలోని గ్రామాల్లో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ప్రారంభించగా.. ఎన్నికలు రావడంతో అర్ధాంతరంగా ఆగిపోయాయి. వాటిలో రైతులు వేరుశనగ, వరి ధాన్యం భద్రపరుచుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో పనులు చేసే కాంట్రాక్టర్లు సైతం సిమెంట్ బస్తాలు, కమ్మీలను నిల్వ ఉంచుతున్నారు. ముఖ్యంగా కొత్తపల్లి, వేణుంబాకం గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న సచివాలయం, ఆర్బీకే, విలేజ్ హెల్త్‌క్లినిక్ భవనాలు గోదాములుగా మారిపోయాయి. అంతేకాకుండా బయట ప్రాంతాల నుంచి వ్యవసాయ పనులకు వచ్చే కూలీలు ఆశ్రయం పొందుతున్నారు.

ముందుగా గుర్తిస్తే క్యాన్సర్‌కు చెక్

క్లుప్తంగా



క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్న వైద్యులు

దక్కిలి : క్యాన్సర్‌ను ముందుగా గుర్తిస్తే నివారించవచ్చని వైద్యాధికారి బిందు ప్రియాంక తెలిపారు. మండలంలోని వెలికల్లు, వడ్ల మోపూరు సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో గురువారం తిరుపతి స్విమ్స్ ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో రెండు పింక్ బస్సుల ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్టు తెలిపారు. స్విమ్స్ వైద్యులు డాక్టర్ చైతన్యభాను, మండల ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, పద్మావతి, సర్పంచ్ వెంకటరమణ, కార్యదర్శులు నరసింహులు, సుబ్బరాయుడు, వైద్య సిబ్బంది సుకుమారి, ఆదిలక్ష్మి, యశస్విని, వైష్ణవి, వెంకటరమణమ్మ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

దక్కిలి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ డైరెక్టర్ చాగణం గౌరీశంకర్ తెలిపారు. ఇందులో తిరుపతి శ్రీ వెంకటేశ్వర అరవింద నేత్రాలయ వైద్యులు 250 మందికి కంటి పరీక్షలు చేసి 70 మందికి మందులు, 30 మందికి కంటి అద్దాలు అందజేసినట్టు తెలిపారు. 70 మందికి ఆపరేషన్లు చేయించనున్నట్టు తెలిపారు. ట్రస్టు సీఈవో సీతారామ్ నాయుడు, కృష్ణా గల్లా, అరవింద్ నేత్రాలయం సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నతనం నుంచి సహృదయంతో మెలగాలి



బహుమతులు అందుకున్న చిన్నారులు

పెళ్లకూరు: పిల్లలు చిన్నతనం నుంచే అందరితోనూ సహృదయంతో మెలిగేలా తల్లిదండ్రులు కృషి చేయాలని రెవరండ్ వినోద్‌కుమార్ తెలిపారు. చిల్లకూరులోని సీఎస్ఐ చర్చి ప్రాంగణంలో గురువారం వీబీఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చిన్నారులకు పరిశుద్ధ గ్రంథం ప్రాముఖ్యతను తెలిపారు. విజేతలకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో సీఎస్ఐ మిషనరీ పాస్టర్ ప్రభాకర్, లివింగ్ చర్చి పాస్టర్ జాన్సన్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలపై ప్రత్యేక దృష్టి

చిల్లకూరు : చెత్త సపంద తయారీ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ శ్రీనివాసులు ఆదేశించారు. ఆయన గురువారం పంచాయతీ కార్యదర్శులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడ వర్మీకంపోస్టు తయారుచేసి రైతులకు విక్రయించాలన్నారు. తద్వారా వచ్చే ఆదాయాన్ని అభివృద్ధి పనులకు వినియోగించాలని పేర్కొన్నారు.

వసతి గృహం తనిఖీ

దొరవారిసత్రం : దొరవారిసత్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహం, పీహెచ్‌సీని గురువారం ఆర్డీవో కిరణ్మయి తనిఖీ చేశారు. వసతి గృహంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అదే విధంగా పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది పనితీరు, రోగులకు అందుతున్న వైద్యంపై ఆరా తీశారు. తహసీల్దార్ శైలకుమారి, వైద్యాధికారి చైతన్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడం



మాట్లాడుతున్న మహేంద్రరెడ్డి

చిల్లకూరు : వైఎస్సార్ సీపీ కీలక నాయకులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడం పరిపాటిగా మారిందని, ఇందులో భాగంగానే మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఆ పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఊటుకూరు మహేంద్రరెడ్డి ఆరోపించారు. ఆయన గురువారం గూడూరు రూరల్ పరిధిలోని నెలటూరు గ్రామంలో ప్రజా ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైఎస్సార్ సీపీ నాయకులను టార్గెట్ చేస్తూ అక్రమ కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని దుయ్యబట్టారు. కేసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి జెడ్పీ నిధులు సాధించేందుకు జెడ్పీటీసీ ఊటుకూరు యామని కృషి చేస్తుందన్నారు. పార్టీకి అంకితభావంతో పనిచేసేవారికి అనుబంధ విభాగాల్లో చోటు కల్పిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో విందూరు ఎంపీటీసీ వెంకటరెడ్డి, గొల్లపల్లి సర్పంచ్ చిన్నయ్య, నాయకులు రవీంద్రరెడ్డి, కనుపూరు రమణయ్య, క్రిష్ణయ్య, తిరుపాల్, రవిరాజు, గోవర్ధనరెడ్డి, నరసింహులు, ప్రకాష్, శివ, గిరి పాల్గొన్నారు.

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి



కమిషనర్ ఫజులుల్లాను సన్మానిస్తున్న చైర్ పర్సన్ దీపిక, ఎంపీపీ ధనలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు

నాయుడుపేట టౌన్ : ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులతో కలిసి నాయుడుపేట మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చైర్ పర్సన్ కటకం దీపిక తెలిపారు. ఆమె గురువారం ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి గ్రేడ్-1 కమిషనర్ పదోన్నతి పొందిన షేక్ ఫజులుల్లాను మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే చొరవతో మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ నాయుడుపేట మున్సిపాలిటీకి రూ.2 కోట్లు మంజురు చేసినట్టు తెలిపారు. వాటితో పలు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు చదలవాడ కుమార్, కావేరిపాకం అశోక్ కుమార్, షేక్ షబ్బీర్, పాలేటి నాగార్జున, సాధు మోహన్, చిన్నా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీతో దానా పంపిణీ



దానా అందిస్తున్న అధికారులు, నాయకులు

పెళ్లకూరు: మండలంలోని ఎస్సీ, ఎస్టీ పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దానా అందజేస్తున్నట్టు పశుసంవర్థక శాఖ ఏడీ డాక్టర్ ధనుంజయ తెలిపారు. ఆయన గురువారం పెళ్లకూరులోని రైతు సేవా కేంద్రంలో పెళ్లకూరు, కొత్తూరు, చిల్లకూరు, పాలచ్చూరు, కలవకూరు తదితర గ్రామాల పాడి రైతులకు 50 శాతం రాయితీపై పశువుల దానా పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ వేసవిలో ఎండలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పాల దిగుబడి తగుతుందన్నారు. ఈ క్రమంలో మంచి ప్రోటీన్‌తో కూడిన దానా అందజేస్తున్నట్లు వివరించారు. రైతులు రూ.555 చెల్లించి దానా పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరీష్, నాయకులు కృష్ణయ్య, మదన్‌నాయుడు, కృష్ణమనాయుడు, ప్రసాద్‌నాయుడు, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కృషి ఫలితమే ఎన్‌ఐవోటీ



మాట్లాడుతున్న కొడవలూరు దామోదర్‌రెడ్డి

వాకాడు : మాజీ ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి కృషి ఫలితంగా నేడు మండలానికి ఎన్ఐవోటీ, నౌకల మరమ్మతుల హబ్ వచ్చినట్టు ఎంపీపీ అనసూయమ్మ ప్రతినిధి, వైఎస్సార్‌సీపీ నేత కొడవలూరు దామోదర్‌రెడ్డి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయన ఎంపీపీ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ మండలంలో మత్స్యకారులకు అనుకూలంగా ఎన్ఐవోటీ, నౌకల మరమ్మతుల కేంద్రం నిర్మించాలని ఆనాడు నేదురుమల్లి జనార్ధన్‌రెడ్డి పలుమార్లు కేంద్రం దృష్టికి తీసుకువెళ్లారని తెలిపారు. ప్రతిపాదనలు పంపించి ఇక్కడి సమస్యలను వివరించారని గుర్తు చేశారు. ఫలితంగానే నేడు నౌకల మరమ్మతుల కేంద్రం వాకాడుకు వచ్చిందని వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ఒక్క అభివృద్ధి పనీ చేయలేదని దుయ్యబట్టారు. కల్లూరు సర్పంచ్ భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగా నిరుపేద కుటుంబాలకు చెందిన వారి ఉపాధి హామీ జాబ్ కార్డులు తొలగించడం దారుణమన్నారు. అధికారులు నిష్పక్షపాతంగా పనిచేసి అర్హులకు న్యాయం చేయాలని కోరారు. ప్రతి సారీ మండల సర్వసభ్య సమావేశానికి పలువురు మండల స్థాయి అధికారులు గైర్హాజరు కావడంపై ప్రజాప్రతినిధులు మండిపడ్డారు. కార్యక్రమంలో తహసీల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, పలువురు అధికారులు, పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి చర్యలు



ఎమ్మెల్సీ మేరగ మురళీధర్‌ను సత్కరిస్తున్న చిట్టమూరు మండల యూత్

చిల్లకూరు/చిట్టమూరు : వైఎస్సార్ సీపీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పిలుపునిచ్చారు. ఆయనను గురువారం గూడూరులోని సనత్‌నగర్‌లో వున్న తన నివాసంలో పలు మండలాలకు చెందిన నాయకులు, యూత్ వింగ్ సభ్యులు కలిశారు. పార్టీ అనుబంధ కమిటీలపై చర్చించారు. ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. నేడు కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచక పాలనను వివరించాలన్నారు. ఈ నెలాఖరులోగా అనుబంధ విభాగాలను పూర్తి చేసి ప్రజల వద్దకు వెళతామని పేర్కొన్నారు. అనంతరం చిట్టమూరు మండలానికి చెందిన యూత్ ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గూడూరు పట్టణ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ క్రిష్ణప్రసాద్‌రెడ్డి, సుభాన్, పూర్ణచంద్ర, జగదీష్, చిట్టమూరు మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన యూత్ ప్రేమ్, సంప త్, సుమన్, ప్రవీణ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

చంద్రప్రభపై ఊరేగిన కరిమాణిక్య స్వామి



చంద్రప్రభ వాహనంపై కొలువుదీరిన స్వామి

నాయుడుపేట టౌన్ : తుమ్మూరులోని శ్రీదేవి, భూదేవి సమేత కరిమాణిక్య స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి స్వామి చంద్రప్రభ వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. ఉదయం సూర్యప్రభపై ఊరేగారు. ఆలయ ప్రధాన అర్చకులు శేషాద్రి స్వామి ఆధ్వర్యంలో టీటీడీ వేదపండితుల ఆధ్వర్యంలో చప్పర ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం, రాత్రి ఊంజల్ సేవ చేపట్టారు. బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చప్పర ఉత్సవం సాయంత్రం మోహిని అవతారంలో సింహ, గజవాహనాల్లో స్వామి వారు ఊరేగుతారని అధికారులు తెలిపారు. రాత్రి నుంచి శనివారం తెల్లవారిజాము వరకు స్వామివారి కల్యాణోత్సవం చేపడతామన్నారు. కార్యక్రమంలో స్థానిక టీటీడీ ఆలయ ఇన్‌స్పెక్టర్లు సుధీర్, హరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాలు కల పిల్లలను గుర్తించాలి



నాయుపేటలో మాట్లాడుతున్న జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్‌రెడ్డి



చిల్లకూరులో విభిన్న ప్రతిభావంతుల సర్వేలో జిల్లా కోఆర్డినేటర్

నాయుడుపేట టౌన్/చిల్లకూరు : ప్రత్యేక అవసరాలు గల బడి ఈడు పిల్లలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించి విద్య అందించేలా చర్యలు తీసుకుంటున్నట్టు సహిత విద్య జిల్లా కోఆర్డినేటర్ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఆయన గురువారం నాయుడుపేట పట్టణం ఎల్ఏ సాగరం, లోతువాని గుంట, బీడీ కాలనీ, చిల్లకూరు మండలంలోని పలు గ్రామాల్లో చేస్తున్న సర్వేను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలోని భవిత కేంద్రాల్లో పనిచేస్తున్న ఐఈఆర్టీలు ఇంటింటికీ వెళ్లి పిల్లలను గుర్తించి సహిత విద్యా కేంద్రాల్లో చేర్పించేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. అలాగే భవిత కేంద్రాల్లో విద్య అందించడంతో పాటు వారికి ఫిజియోథెరిపీ, స్పీచ్ థెరపి ఉచితంగా చేయిస్తున్నామని వెల్లడించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీలు ఎం సుబ్రహ్మణ్యం, నేతాజీ, లలిత, నాగరాజు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

వాకాడు : మండలంలోని దుగ్గవరం గ్రామంలో గురువారం మహిళ అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. కోట మండలం విద్యానగర్ ప్రకాశం కాలనీకి చెందిన స్వర్ణలత వాకాడు మండలం దుగ్గవరంలోని అరుంధతి కాలనీకి చెందిన కొండాపురం పరశురాంను తొమ్మిదేళ్ల క్రితం ప్రేమించి కులాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. కొంత కాలంగా పరశురాం భార్యను తరచూ కొడుతూ మానసికంగా వేధిస్తున్నాడు. రెండు రోజులుగా కొట్టడంతో స్పృహ కోల్పోయింది. వాకాడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా పరిశీలించిన వైద్యులు ఆమె అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నాగబాబు తెలిపారు.

గ్రామాల అభివృద్ధే ధ్యేయం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ

ఓజిలి: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. ఆమె గురువారం కురుగొండ గ్రామంలో సీసీ రోడ్లు, జలజీవన్ మిషన్ పథకంలో తాగునీటి పైపులైన్లను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.40 లక్షలతో సీసీరోడ్లు, రూ.30 లక్షలతో జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ కొళాయి కనెక్షన్లకు నిధులు మంజూరు చేసినట్టు తెలిపారు. మండలంలో రెండో పంటకు చెరువుల ద్వారా సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతరం గ్రామంలో పల్లెనిద్ర చేశారు. కురుగొండ గ్రామంలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు టీడీపీ నాయకుడు దారా అంకయ్యను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ నెలవల సుబ్రమణ్యం, పార్థసారథి, టీడీపీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌నాయుడు, గున్నం సేవా ట్రస్ట్ చైర్మన్ గున్నం మధుసూదన్‌రెడ్డి, దారా అంకయ్య, కె.శ్రీనివాసులురెడ్డి, పాడి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

దారిని తవ్వేశారు.. న్యాయం చేయండి



దారిలో తవ్విన గుంత

సైదాపురం: పొలంలోకి వెళ్లేందుకు ఎన్నోఏళ్లుగా ఉన్న దారికి అడ్డంగా గుంత తవ్వి ఇబ్బంది పెడుతున్నారు. న్యాయం చేయండి అని సైదాపురం మండలం గిద్దలూరుకు చెందిన రైతు చిల్లకూరు ప్రభాకర్‌రెడ్డి కోరుతున్నాడు. బాధితుడి కథనం మేరకు.. చిల్లకూరు ప్రభాకర్‌రెడ్డికి గ్రామంలో పది ఎకరాల పొలం ఉంది. అందులో సవక తోటలు సాగు చేశాడు. అదే గ్రామానికి చెందిన వారికి కూడా భూములు ఉన్నాయి. వాటిలోకి వెళ్లడానికి ఎన్నో ఏళ్లుగా దారి ఉంది. దాని ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రభాకర్‌రెడ్డి వైఎస్సార్ సీపీకి మద్దతు పలకడంతో పక్కనున్న రైతులు అతనిపై కక్ష పెంచుకున్నారు. దారికి అడ్డంగా గుంత తవ్వేశారు. నాలుగేళ్ల ఏళ్లు కష్టపడి పెంచిన సవక కొయ్యలను అక్కడి నుంచి తరలించడానికి వీలులేకుండా చేశారు. ఈ విషయమై రెవెన్యూ, పోలీసు అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయకపోతే తనకు ఆత్మహత్యే శరణ్యమని ఆ రైతు వాపోతున్నాడు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

దొరవారిసత్రం : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దువ్వూరు సుజాతమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టుఎంపీడీవో గోవర్ధన తెలిపారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేస్తున్న అభివృద్ధి పనులు, మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చ ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు తప్పక హాజరుకావాలని కోరారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పనే ధ్యేయం

వెంకటగిరి రూరల్ : నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ డిగ్రీ కళాశాలలో గురువారం ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో పలు బహుళ జాతీయ కంపెనీల ప్రతినిధులు మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చేసి 5వ తరగతి చదువు కున్న వారి నుంచి ఉన్నత చదువులు చదువుకున్న వారి వరకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై అవగాహన

కలువాయి (సైదాపురం) : మండలంలోని చీపినాపి ఉన్నత పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయులు సద్దా జనార్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అధ్యాపకులు రామలింగయ్య మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు స్కిల్ డెవలప్‌మెంట్‌పై దృష్టి సారించాలన్నారు. ఉద్యోగంలో స్థిర పడాలంటే విద్యతోపాటు స్కిల్స్ ఎంతో అవసరమని తెలిపారు. ఉపాధ్యాయులు మోహన్‌రాజు, సీఆర్‌పీ పెంచలయ్య, ఏఎస్ఎంసీ చైర్మన్ కాలేషా, సర్పంచ్ పెంచలయ్య పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తులు

వెంకటగిరి రూరల్ : అన్నదానత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ నాగార్జునసాగర్ తెలిపారు. రైతులు తమ గ్రామాల్లో ఉన్న వ్యవసాయ సహాయకులను కలిసి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతూ ఫార్మర్ ఐడీ తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు. లేని పక్షంలో వారు పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలకు అర్హులు కారని తెలిపారు.

రాయితీ రుణాలకు దరఖాస్తులు

చిట్టమూరు : మండలంలోని ముస్లింలు, క్రిష్టియన్లు మైనారిటీ కార్పొరేషన్ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో మనోహర్ గౌడ్ తెలిపారు. ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ 21 నుంచి 55 ఏళ్లలోపు వుండి, రూ.1.50 లక్షల వార్షిక ఆదాయం ఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. ఈ నెల 25 వరకు గడువు ఉందని, స్థానిక గ్రామ సచివాలయంలో రేషన్‌కార్డు, ఆధార్, కుల ధ్రువీకరణ పత్రం జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

శ్మశానం ఆక్రమణపై గిరిజనుల నిరసన



నిరసన తెలుపుతున్న గిరిజనులు

బాలాయపల్లి(సైదాపురం) : బాలాయపల్లి మండలం మన్నూరు గ్రామం గిరిజనుల శ్మశాన స్థలాన్ని అదే గ్రామానికి చెందిన జడపల్లి రమణయ్య అనే వ్యక్తి ఆక్రమించినట్టు స్థానికులు ఆరోపించారు. వారు గురువారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తమ పూర్వీకుల నుంచి మృతదేహాలను ఖననం చేసుకుంటున్న స్థలాన్ని రమణయ్య ఆక్రమించాడని తెలిపారు. ఇదేమని ప్రశ్నిస్తే ప్రభుత్వం మాది దిక్కున్నచోట చెప్పుకోండి అని బెదిరించారని వాపోయారు. అలాగే మరికొంత భూమి చుట్టూ సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటుచేశారని తెలిపారు. శ్మశాన స్థలాన్ని ఆక్రమణలను నుంచి కాపాడాలని కోరారు.